క్లుప్తంగా

అటవీ భూములకు హద్దుగా కందకాలు



కందకం తవ్విస్తున్న అటవీ శాఖ అధికారులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ శివారులో అటవీ భూముల ఆక్రమణలపై అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. కొందరు అటవీ భూములను ఆక్రమించి చదును చేస్తున్నట్లు కొన్ని నెలల క్రితం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. దీంతో అటవీ భూముల వద్ద కందకాలు తవ్వించి హద్దుగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌వో షౌకత్‌అలీ, డీఎఫ్ఆర్వో అరుణ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక మానసికోల్లాసం



అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభిస్తున్న వైద్యుడు

మెట్‌పల్లి: క్రీడలతో శారీరక మానసికోల్లాసం కలుగుతోందని పిల్లల వైద్యుడు చైతన్య అన్నారు. మెట్‌పల్లి పట్టణంలోని మినీ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో స్నేహభావం ఏర్పడుతోందని, అలాగే ధృడంగా తయారవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ముత్తయ్య,సభ్యులు కార్తీక్, శంకర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు



బెల్లం పానకాన్ని పారబోస్తున్న పోలీసులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం ఆత్మనగర్ శివారులో గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. కొద్దిరోజులుగా పెద్ద ఎత్తున్న గుడుంబా తయారీ చేస్తూ విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్సై కిరణ్‌కుమార్,సిబ్బంది విశాల్,ప్రణయ్ బుధవారం మఫ్టీలో గుడుంబా తయారీ చేస్తున్న ప్రాంతానికి వెళ్లారు.10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని,1500 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. అలాగే గుడుంబా తయారీకి ఉపయోగించే వస్తువులు,పాత్రలు,డ్రమ్ములను ధ్వంసం చేశారు. గుడుంబా తయారీదారుడు భూక్య పురుషోత్తంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

జీలుగ విత్తనాలు పంపిణీ



జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న డీఏవో

సారంగాపూర్: పచ్చిరొట్ట ఎరువుల వినియోగంతో నత్రజని రసాయనిక ఎరువుల వాడకాన్ని నియంత్రించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి వి. భాస్కర్ అన్నారు. బుధవారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీలుగ విత్తనాలను పచ్చిరొట్ట కింద సాగుచేసి, పొలం నాటు వేసే ముందు కలియదున్ని, నాటువేస్తే రసాయనిక ఎరువుల వాడకం తగ్గించడమే కాకుండా భూసారాన్ని పెంచడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఏడీఏ తిరుపతినాయక్, విండో సీఈవో అయ్యోరి తిరుపతి , ఏఈవోలు శిరీష, వినోద్, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఇన్‌చార్జి తహసీల్దార్



జగిత్యాలరూరల్ (రాయికల్): రాయికల్ మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా గణేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు రెవెన్యూ సేవలు అందేలా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తానన్నారు.

లీకేజీల మిషన్ భగీరథ..

- ఎక్కడ చూసినా భగీరథ పైపుల లీకేజీలే
- చాలా చోట్ల ట్యాపులే లేని వైనం
- వృథాగా పోతున్న శుద్ధ జలం
- పట్టించుకోని స్థానిక అధికారులు



చిన్నమెట్‌పల్లిలో ట్యాంకు నిండి వృథాగా పోతున్న నీళ్లు

కోరుట్ల రూరల్: ప్రతి ఇంటికీ శుద్ధమైన నీళ్లు ఇవ్వాలనే సంకల్పంతో గత ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం నీరుగారుతోంది. అధికారుల పర్యవేక్షణా లోపం, మరమ్మతులు చేపట్టక పోవటంతో ఎక్కడ చూసినా లీకేజీలతో నీళ్లు వృథాగా పోతున్నాయి.దీంతో ఇంటింటికీ పైప్ లైన్ వేసి నీళ్లు సరఫరా చేసున్నప్పటికీ సరైన పర్యవేక్షణ లేక పైపులు పగలటం, చాలా చోట్ల ట్యాపులు లేక పోవటంతో నీళ్లు రోడ్లపై, డ్రెయినేజీల్లో వృథాగా పోతున్నాయి.

ట్యాపులు లేక వృథాగా డ్రెయినేజీల్లోకి..

పట్టణాల్లో దూకాణాల ముందు కూడా మిషన్ భగీరథ నల్లాలు ఏర్పాటు చేశారు. పలు చోట్ల నల్లాలు చెడిపోయి పనిచేయక పోవటంతో పాటు చాలా చోట్ల ట్యాపులు పనిచేయక వాటిని తొలగించి డైరెక్టుగా నీళ్లు వాడుకుంటున్నారు. దీంతో నాలుగైదు గంటలూ సరఫరా అవుతున్న నీళ్లు వృథాగా పోతున్నాయి.గ్రామాల్లో కూడా చాలా ఇండ్లల్లో ట్యాపులు చెడి పోవటంతో కొత్త ట్యాపులు బిగించుకోలేదు. అవసరమున్న మేరకూ నీళ్లు వాడుకుని అలాగే వదిలేస్తున్నారు. దీంతో నీళ్లు డ్రెయినేజీల్లో వృథాగా పోతున్నాయి.

పగిలిపోయిన పైపులు..

ఇళ్లల్లోకి సరఫరా అయ్యే పైపులు చాలా చోట్ల ఓపెన్ పైపులు వేశారు. ఓపెన్ పైపులు ఎండలు, వానలకు చాలా చోట్ల పగిలిపోయి లీకవుతున్నాయి. పలు చోట్ల రోడ్లపై ఉన్న పైపులు కూడా పగిలిపోయి రోడ్లపై నీళ్లు వృథాగా పోతున్నాయి. వీటితో పాటు ట్యాంకుల్లోకి సరఫరా చేసే మెయిన్ పైప్ లైన్లు కూడా తరచూ లీకవుతూ నీరంతా వృథాగా పోతున్నా.. అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదు. కోరుట్ల మండలంలోని చిన్నమెట్‌పల్లి శివారులో మెయిన్ పైప్‌లైన్ గత 15 రోజులుగా రెండు చోట్ల లీకేజీ అవుతూ నీళ్లు పొలాల్లో వృథాగా పోతున్న ఇంత వరకూ మరమ్మతులు చేపట్టడం లేదు.



చిన్నమెట్‌పల్లి శివారులో లీకవుతున్న పైప్‌లైన్

ట్యాంకుల్లో ఓవర్ ఫ్లో..

అయిలాపూర్, చిన్నమెట్‌పల్లితో పాటు పలు గ్రామాల్లో నీళ్లు ఓవర్ ఫ్లో అయి వృథాగా పోతున్నాయి. గేట్ వాల్వులు ఆఫ్ చేయక పోతుండటంతో నీళ్లు డ్రెయినేజీల్లోకి వెళ్లి పోతున్నాయి. నీళ్లు వృథాగా పోతున్నప్పటికీ వాటికి మరమ్మతులు చేపట్టకపోవటం, గ్రామాలు, పట్టణాల్లో అధికారుల పర్యవేక్షణ లేక పోవటంతో శుద్ధజలం వృథాగానే డ్రెయినేజీలు, రోడ్లపై పోతున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు లీకేజీలు లేకుండా సరిగా సరఫరా జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

లీకేజీల బాధ్యత స్థానిక అధికారులదే

గ్రామాల్లో ఉన్న ట్యాంకులకు నీళ్లు సరఫరా చేసే గ్రిడ్ లైన్లు లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేపడతాం. పలు చోట్ల లైన్లు అప్పుడప్పుడు లీకేజీలు అవుతున్నాయి. మా దృష్టికి రాగానే వెంటనే మరమ్మతులు చేపడుతున్నాం. పట్టణాలు, గ్రామాల్లో పైపుల లీకేజీల బాధ్యత స్థానిక అధికారులదే.

– శేఖర్ రెడ్డి, ఈఈ ,మిషన్ భగీరథ, జగిత్యాల

మరమ్మతు చేపడుతాం



పట్టణంలో మిషన్ భగీరథ పైప్ లైన్ల ద్వారా నీళ్లు సరఫరా చేస్తున్నాం, ఎక్కడైనా లీకేజీలు ఉంటే గుర్తించి మరమ్మతులు చేపడతాం. ఇళ్లు, దుకాణాల ముందర ఉన్న పైపుల ట్యాపులకు వాళ్ల బాధ్యతనే, అలాగే వదిలేస్తే పైపులు క్లోజ్ చేసి నీటి సరఫరా నిలిపి వేస్తాం. నీళ్లు వాడుకుంటున్నప్పుడు ట్యాపు పాడయితే చేయించుకునే బాధ్యత వాళ్లదే.

– అందె మారుతి, బల్దియా కమిషనర్, మెట్‌పల్లి



కథలాపూర్: మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనంలో మొక్కలు ఎండిపోయాయి. మొక్కలకు నీళ్లు పోయకపోవడంతో ఎండిపోయాయని గ్రామస్తులు అంటున్నారు. ఉపాధిహామీ పథకం అధికారులు స్పందించి ఎండిపోయిన మొక్కలకు నీళ్లు పోసి కాపాడాలని ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు. పల్లె ప్రకృతి వనం పచ్చదనంతో కళకళలాడేలా చర్యలు తీసుకోవాలంటున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేందర్, ఏపీవో, కథలాపూర్, సెల్ నం: 9490526814

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్న విప్

ధర్మపురి: సబ్సిడీలపై అందిస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురిలోని కేడీసీఎమ్మెస్ ఫర్టిలైజర్‌లో బుధవారం విప్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వ్యవసాయాధికారులు, నాయకులు, రైతులు తదితరులున్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతులు ప్రదానం

బుగ్గారం: మండలంలోని గోపులాపూర్‌లో స్థానిక నాయకులు బల్గూరి రామారావు ఆధ్వర్యంలో అన్నంనేని శ్రీవేణి మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో విజేతలుగా నిలిచిన జట్లకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ బహుమతులను ప్రదానం చేశారు. టోర్నీ విజేతగా నిలిచిన యశ్వంతరావుపేట జట్టుకు రూ.20 వేలు, రన్నరప్ గోపులాపూర్ జట్టుకు రూ.15 వేలు నగదు బహుమతి, ట్రోఫీ అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేముల సుభాష్, బత్తుల తిరుపతి, బీర్పూరి తిరుపతి, గాలిపెల్లి వెంకన్న,కస్తూరి మల్లేశ్,రవీందర్ రెడ్డి, నంది తిరుపతి పాల్గొన్నారు.

ఫీజుల పెంపు నిర్ణయం ఉపసంహరించుకోవాలి



వినతిపత్రం ఇస్తున్న ఏబీవీపీ నాయకులు

జగిత్యాలటౌన్: ఇంజనీరింగ్ కళాశాలల ఫీజుల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మల్యాల రాకేశ్ డిమాండ్ చేశారు. ఇంజనీరింగ్ కళాశాలల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, జిల్లాలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు బుధవారం అదనపు కలెక్టర్ బీఎస్ లతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాకేష్ మాట్లాడుతూ మూడేళ్ల కొకసారి ఒక పద్ధతి ప్రకారం పెంచాల్సిన ఇంజనీరింగ్ కళాశాలల చార్జీలను ఇష్టారీతిన పెంచడానికి ప్రతిపాదనలు పంపిన టీఏఎఫ్ఆర్‌సీ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కరీంనగర్ విభాగ్ కన్వీనర్ అజయ్, హాస్టల్స్ కన్వీనర్ రాసూరి ప్రవీణ్ నాయకులు సిద్దార్థ, శ్రీకాంత్, నిఖిల్ పాల్గొన్నారు.

కోరుట్లలో తిరంగా యాత్ర




తిరంగా యాత్రలో బీజేపీ నాయకులు

కోరుట్ల: బీజేపీ ఆధ్వర్యంలో కోరుట్లలో బుధవారం తిరంగాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త బస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి నంది చౌరస్తా వరకు జాతీయ జెండాలతో తిరంగాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆపరేషన్ సింధూర్ విజయాన్ని పురస్కరించుకుని త్రివిధ దళాల సేవలకు కృతజ్ఞతగా తిరంగా యాత్ర నిర్వహించినట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి నవీన్ కుమార్, పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేశ్, నాయకులు ఇందూరి సత్యం,మాడవేణి నరేష్, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వివాహిత మృతి

మల్యాల: ఇంటి వద్ద బట్టలు ఆరవేస్తుండగా, డిష్ వైరుకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్‌తో వివాహిత మృతి చెందిన ఘటన మల్యాల మండలం రాజారంలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై కథనం ప్రకారం.. రాజారం గ్రామానికి చెందిన శీలం మానస బుధవారం తన ఇంట్లో బట్టలు ఆరవేస్తుండగా, డిష్ వైరు బాక్సు నుంచి విద్యుత్ సరఫరా అయి షాక్‌తో పడిపోగా, స్థానికులు జగిత్యాలకు తరలించగా, అప్పటికే మృతిచెందిందని వైద్యులు తెలిపారు. తన కూతురు మృతికి కారణమైన డిష్ యజమానిపై చర్యలు తీసుకోవాలని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలి భర్త సంతోష్ మంగళవారం దుబాయ్ వెళ్లగా, భార్య మృతి వార్త తెలుసుకుని, తిరిగి వస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి కూతురు, కుమారుడు ఉన్నారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి



మృతిచెందిన గేదెలు

సారంగాపూర్: బీర్‌పూర్ గ్రామ శివారుల్లో విద్యుత్ తీగలు తెగిపడడంతో రెండు గేదెలు, ఒక పెంపుడు కుక్క మృతిచెందింది. బీర్‌పూర్ శివారు గ్రామం సిరిపురంలో ఈదురు గాలులు వీచడంతో ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. పర్స నర్సయ్య. సామల శ్రీనివాస్‌కు చెందిన రెండు గేదెలు మేతకు వెళ్లి విద్యుత్ తీగలు తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. మీర విగ్నేష్ అనే వ్యక్తికి చెందిన పెంపుడు కుక్క కూడ మృత్యువాత పడింది. కాగా ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రభుత్వ పరంగా రైతులను ఆదుకోవాలని కోరారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

జగిత్యాల: కాళేశ్వరం సరస్వతి పుష్కరాలకు వెళ్లిన ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును పుష్కరాల్లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జ్యోతి ఉన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న మాజీ జెడ్పీటీసీ సునీత

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రంలోని మిచ్చమ్మ ఆశ్రమం వద్ద బుధవారం మాజీ జెడ్పీటీసీ , కాంగ్రెస్ పార్టీ నాయకురాలు సునీత బుసారపు రాజేశ్వర్‌కు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బొరిగం రాజు, వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, డైరెక్టర్ బుక్య రాజేందర్, రాజరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

జగిత్యాలరూరల్(రాయికల్): పట్టణంతో పాటు మండలంలోని గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్ల వేగవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ఇన్‌చార్జి తహసీల్దార్ గణేశ్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పోసిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బర్కం మల్లేశ్, మండల, పట్టణ కో–ఆర్డినేటర్ తురగ శ్రీధర్‌రెడ్డి, మైనార్టీ విభాగం అధ్యక్షుడు ఎండీ.చాంద్‌పాషా, మాజీ సర్పంచ్ నీరటి శ్రీను, మాజీ ఎంపీటీసీ రాజేందర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల శిక్షణను పరిశీలించిన డీఈవో

మల్యాల: మండలంలోని ఎస్ఎస్‌వీ పాఠశాలలో ఉపాధ్యాయులకు కెపాసిటీ బిల్డింగ్ అంశంపై ఐదు రోజులపాటు నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం జిల్లా విద్యాధికారి కె.రాము సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులందరూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని అంశాలను నేర్చుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంఈవో జయసింహారావు ఉన్నారు.

యువ వికాసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు

జగిత్యాలరూరల్: రాజీవ్ యువ వికాసం పథకం 2024–25 పథకం కోసం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 22 నుంచి 27 వరకు జగిత్యాల అర్బన్ మండల పరిషత్ కార్యాలయంలో మండలస్థాయి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు.

రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న జగిత్యాల రూరల్ మండల అభ్యర్థులకు ఈనెల 22 నుంచి 29 వరకు జగిత్యాల రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమాదేవి తెలిపారు.

మెట్‌పల్లిరూరల్: రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 23 నుంచి 28 వరకు మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మెట్‌పల్లి ఎంపీడీవో మహేశ్వర్‌రెడ్డి తెలిపారు.

నేడు, రేపు ఇంటర్వ్యూలు

సారంగాపూర్: రాజీవ్ యువ వికాస్ కింద లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ఈ నెల 22, 23 తేదీల్లో రెండు రోజుల పాటు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు బీర్‌పూర్ ఎంపీడీవో లచ్చాలు పేర్కొన్నారు.

పెగడపల్లి: ఈ నెల 22 నుంచి 27 వరకు మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 11గంటలరు కార్పొరేషన్ల వారిగా రాజీవ్ యువశక్తి పథకానికి దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కథలాపూర్: మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 22 నుంచి 27 వరకు రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంకర్ బుధవారం తెలిపారు. దరఖాస్తుదారులు అన్ని ధృవీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఎంపీడీవోలు పేర్కొన్నారు.

ఇబ్రహీంపట్నం: రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 22 నుంచి 27 వరకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో చంద్రశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

బుగ్గారం: రాజీవ్ యువవికాసం పథకం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 23వ తేదీ నుండి 29వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అఫ్జల్‌మియా తెలిపారు.

మల్లాపూర్: రాజీవ్ యువవికాసం పథకాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఈ నెల 23 నుంచి 27వరకు బ్యాంక్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శశికుమార్‌రెడ్డి తెలిపారు.



రాయికల్ గాంధీచౌక్ వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజీవ్‌గాంధీకి నివాళి



కోరుట్లలో నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జగిత్యాలరూరల్(రాయికల్)/కోరుట్ల/ కథలాపూర్ /పెగడపల్లి: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్థంతి సందర్భంగా బుధవారం జిల్లాల్లోని పలు మండలాలు, గ్రామాల్లో ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు నివాళి అర్పించారు. దేశంలో ఐటీ రంగానికి పునాది వేసిన గొప్ప నేత రాజీవ్ గాంధీ అని కొనియాడారు. ఓటు హక్కును 18 ఏళ్లకు తగ్గించారని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, కథలాపూర్ ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, కోరుట్ల పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు తిరుమల గంగాధర్ గౌడ్, కొంతం రాజం, పెగడపల్లి ఏఎంసీ చైర్మన్ రాములుగౌడ్, వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, రాయికల్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్ల' కు డబ్బులు వసూలు

- సీరియస్ అయిన జువ్వాడి కృష్ణారావు
- డబ్బులు వాపస్ ఇవ్వాలని మండిపాటు

కోరుట్ల: ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానని డబ్బులు వసూలు చేసిన ఓ కాంగ్రెస్ నాయకుడిపై పార్టీ సీనియర్ నేత జువ్వాడి కృష్ణారావు మండిపడ్డారు. డబ్బులు వాపస్ ఇవ్వాలని సూచించారు. కోరుట్ల మండలం అయిలాపూర్‌కు చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు ఇందిరమ్మ ఇళ్లు ఇప్పిస్తానని కొంతమంది లబ్ధిదారుల నుంచి రూ.20వేల చొప్పున వసూలు చేసినట్లు సమాచారం జువ్వాడి కృష్ణారావుకు చేరింది. సదరు నాయకుడిని కోరుట్లలోని జువ్వాడి భవన్‌కు పిలిపించుకుని సీరియస్ అయినట్లు తెల్సింది. వెంటనే డబ్బులు వాపస్ చేయాలని ఆదేశించారని సమాచారం. నియోజకవర్గంలో అవినీతికి అడ్డుకట్ట వేయాలన్న లక్ష్యంతో స్వర్గీయ జువ్వాడి రత్నాకర్‌రావు సెల్ నంబరుతో కృష్ణారావు కంప్లయింట్ సెల్ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో అయిలాపూర్‌లో డబ్బులు వసూలు చేసిన ఘటన వెలుగుచూసింది.

25న గ్రామ పరిపాలన అధికారి రాతపరీక్ష



జగిత్యాల: ఈనెల 25న ఆదివారం గ్రామ పరిపాలన అధికారి రాతపరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు పరీక్ష ప్రారంభానికి గంట ముందుగా పరీక్ష హాలులోకి అనుమతిస్తామన్నారు.అభ్యర్థులు రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఏదైనా గుర్తింపు కార్డు తీసుకుని రావాలని, హాల్‌టికెట్‌పై గెజిటెడ్ సంతకం ఉండాలని, అభ్యర్థులు హాల్‌టికెట్లు CCLA.TELANGANA.GOV.IN/EMPLOYEE DETAILS.DO నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని అభ్యర్థులు హాల్‌టికెట్‌లో సూచించిన నియమాలు తప్పకుండా పాటించాలన్నారు.